# ఇక్కడ సమానత్వం దొరుకును!



-ఎం.సి.శివశంకర శాస్త్రి

## 'అబ్బా! అమ్మా'

## రంగడు మూల్గుతున్నాడు! నొప్పికి తట్టుకోలేక పోతున్నాడు.

తనకు బుద్ధి తెలిసినప్పట్నుంచీ ఊరి పెదకాపు హనుమయ్యగారింట ఊడిగం చేసిన రంగడు దాదాపు మూడేళ్ళ క్రితం వరి పొలంలో పనిచేస్తుండగా కాలికి పార తగిలి చిన్న గాయమైంది. అదికాస్తా వ్రణంగా మారి కాలు తీసేయటం జరిగింది.

ఇక "ఈ కుంటోడు మనింట కాయకష్టానికి పనికిరాడ"న్న నెపంతో పనిలోంచి పీకి పడేశాడు పెదకాపు వెంకటరెడ్డి. ఫలితంగా... మెతుకులకు మొఖం వాచి మనోవ్యాధితో మంచాన పడ్డాడు.

"పొద్దు గూకులూ మూల్గకు మావా! ఇంకా నీరస పడిపోతావ్. కాసేపు కళ్ళు బిర్రుగా మూసుకు పడుకో... నిద్రపట్టుద్ది" కుక్కిలో మూల్గుతూ పడుకున్న రంగడితో అంది భార్య రంగమ్మ.

"కడుపులో కారం పల్లినట్టుంటే నిద్దరేడపట్టుద్దే?" చీదరించుకుంటూ అన్నాడు.

"నిన్నిలా వొదిలేసి నేనేపనికి పోగల్ను సెప్పు?" కనుకొలకుల్లో కదలాడే నీళ్ళను... చిరిగిన చీరచెంగుతో తుడుచుకుంటూ బాధగా అంది. ఆకలి మంటకు తోడు అనారోగ్యంతో అలమటిస్తున్న రంగడికి బతుకుమీద రోత పుట్టింది.

★ ★ ★

ఆ పూరిపాకలో ఇద్దరు కొడుకులు, ఓ కూతురు, తనూ, తన పెళ్ళాంతో కాపురముంటున్నాడు రంగడు.

పెద్దకొడుకు ఓబులేసు పెదకాపు హనుమయ్యకి చుక్కెదురైన మరో మోతుబరి రైతింట జీతగాడు. పగలంతా ఆ మోతుబరి ఇంట చెమటోడ్చి వాళ్ళు పడేసిన సంకటి ముద్ద అక్కడే గతికి రేయి పడుకునే వేళకి ఇల్లు చేరుకుంటాడు తప్ప తల్లిదండ్రులకే మాత్రం అందుగా లేదు.

రెండవ సంతు కమల. అది వట్టి ఎర్రి బాగుల్ది. ఊరంతా తిరుగుతుంది, కనిపించిందంతా తింటుంది. రోజూ సాయంత్రం అమెను మాత్రం ఊరంతా గాలించి



ఇంటికి తీసుకురావాలి. ఈపని రంగమ్మదే. దాని ఎర్రిబతుకు తన పాలి ఓ వరంగా ఎంచి కడుపుచేశాడో ప్రబుద్ధుడు. తల్లిదండ్రులుండీ అదో అనాధకిందే లెక్క.

చిన్న కొడుకు రాజా. పట్నంలో పేద విద్యార్థుల హాస్టల్లో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్నాడు. అక్కంటే వాడికి కొండంత ప్రేమ. తను పదో తరగతి పాసయ్యాక ఏదేని ఉద్యోగంలో చేరి అక్కను

ఆసుపత్రిలో చేర్పించి ఆరోగ్యం కుదుట పడ్డాక ఓ అయ్యకిచ్చి పెళ్ళి చేయాలన్నదే వాడి తపన!

ఇదీ రంగడి కథ.

చిన్నప్పట్నుంచీ బానిస బతుకు సాగిస్తూ చెమటోడ్చిన రంగడికీ దశలో కడుపునిండా కూడు లేకపోవటంతో కడుపు రగిలినప్పుడల్లా తలరాతను తిట్టుకుంటూ పెదవి కొరుక్కుంటుంటాడు.

★ ★ ★



రోజులు వారాలై నెలలుగా దొర్లిపోతున్నాయ్.

పైకప్పు సరిగాలేని పూరిపాకలో పగలంతా కాపురముండి సెలవు తీసుకోవడానికి పడమటి నేప్పు పరుగులు తీస్తున్నాడు కర్మసాక్షి.

"ఈసారయినా పాకకు కప్పేయించుకోవాలి మామా!" పైకప్పులోంచి సూటిగా తన కళ్ళను తాకిన ఎండనుచూసి అంది రంగమ్మ.

రంగడు నవ్వాడు.

"ఏంది మామా?" నవ్వుకు అర్థం తెలుసుకో గోరిన ప్రశ్న.

"ముందే ముక్కిడి, అందులో పడిశం అన్నట్టు నన్ను పీల్చి పడేస్తున్న ఈ మాయదారి రోగాన్ని నయం సేసుకునేందుకే పైసల్లేక చస్తూంటే పాకకు కప్పేద ఏయించగలమే ఎర్రిమొగమా? ముందు నీవొళ్ళు కప్పుకుందుకు ఓ మోతకరకం చీర తెచ్చిగల్గితే పాకకు కప్పేయించినట్టే అవుతుంది" రంగమ్మ కట్టుకున్న చిరుగుల చీరకేసి చూస్తూ అన్నాడు రంగడు.

రవిక గురించి మరేమయినా వర్ణించగలడేమోనన్న సంశయంతో చిరిగిన చీరచెంగుతో సడలిన వయసుపొంగుల్ని చప్పున కప్పేసుకుంది రంగమ్మ.

★ ★ ★

సెలవుల్లో హాస్టల్ మూసివేయడంతో గత్యంతరం లేక ఇంటికొచ్చేశాడు రాజు. రంగమ్మ ఎక్కువ సమయం ఆ రోగిష్టిమొగుడి చెంతనే కూచుని ఉంటూండటంతో పొయ్యిలో పిల్లిలేవటం కష్టమయింది.

"అమ్మా! రేపట్నుంచీ నేను కూలిపని కెల్తానే, ఇలా ఎన్నాళ్ళని కడుపు మాడ్చుకుని ఉండగలం?" ఇంటి పరిస్థితినర్థం చేసుకున్న రాజు అన్నాడు.

"వొద్దు బాబూ! వొద్దు.... కూలి బతుకులు మా వరకే పాలు" కళ్ళల్లో నీళ్ళుబికివచ్చి, వాణ్ణి గుండెలకు హత్తుకుంది రంగమ్మ.

"దేనికేనా కాలం కలిసిరావాలే పిచ్చిదానా! సీకటి తర్వాత వెన్నెల ఎట్టావస్తాదో, కష్టాల ఎనక సుకంగూడా ఉంటుంది. ఈడు పదోతరగతి గట్టెక్కేడంటే వెంటనే గవర్నమెంటులో ఓ సిన్న ఉద్యోగం వచ్చేసుద్ది. ఆనక మనం హాయిగా ఉండొచ్చు!" భవిష్యత్తుపై కొండంత ఆశ ఉంచుకుని ఇల్లాలికి ధైర్యం చెప్పేడు రంగన్న.

"ఇంకిలా లాభంలేదు నాకేదైనా పనిప్పించమని... మా అయ్యకి తెలిసిన షావుకారు కాడికి పట్నం మెల్తాస్తామావా" అంటూ పెట్టే బేడా సర్దుకుంది రంగమ్మ.

★ ★ ★

ముసురు.

పాడు ముసురు.

రేయింబవళ్ళూ ముసురే ముసురు.

సూరీడు కనిపించకుండా ఐదు రోజులుగా పట్టిన ముసురు ఆ సాయంత్రం కొంత తెరపిచ్చింది.

దాదాపు అర్ధరాత్రి దాటాక అనుకోని విధంగా ప్రకృతి విలయతాండవం చేసి పెనుగాలులతో కుండపోతగా వర్షం కురిపించింది!

కనుమూసి తెరిచేలోగా ఏమైందో తెలీదు. ఏవో పెళపెళా శబ్దాలు, కొన్ని క్షణాలు... చెట్లూ... ఇళ్ళూ... అటూ ఇటూ ఊగిపోయాయి!

భూకంపపు తీవ్రతకి మనుషులతో పాటు గొడ్డూ, గోదా అన్నీ నేలమట్టమయ్యాయి!

మర్నాడు ప్రధానమంత్రి మొదలు ఛోటామోటా లీడర్లంతా తమ దిగ్భ్రాంతిని, సంతాపాన్ని తెలియజేస్తూ పత్రికా ముఖంగా ఇచ్చిన ప్రకటనలు అన్ని పత్రికల్లోనూ తొలివార్తగా చోటుచేసుకున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలమేరకు పలువురు ప్రభుత్వాధికారులు హాజరై సామూహిక దహనకాండకు తగు ఏర్పాట్లు చేశారు!

ఎక్కడ చూసినా సామూహిక కాష్టం మీద కుప్పలుగా కాలిపోతున్న శవాల్ని చూసి రోదిస్తోన్న జనమేకన్పించారు!

ఉన్నట్టుండి కాష్టం మీద సగం కాలిన రంగడి శవం నిగ్రవీల్గి లేచింది. నూన శవాన్ని గుర్తుపట్టి బావురుమంది రంగమ్మ. ఆమె గుండెలు ఎగిసెగిసి పడ్డాయి... మరుక్షణం... పెద్దగా నవ్వి...

"సూడండయ్యా మనుషుల ముడితేనే మైలపడి పోతామన్నట్టుగా దూరంగా తొలగిపోయే మావూరి పటేల్ సాంబశివరావు చౌదరి తనకంటే వయసులో ఎంతో పెద్దదయిన మా కులపు రాములమ్మతో పాటుమాటు సరసాలు సాగించి ఆమెననుభవించి ఇప్పుడు దాన్తోపాటు ఈ కాష్టమ్మీద కాలి బూడిదై పోతున్నాడు...

నా కడుపున పుట్టిన పిచ్చిపిల్లని వాగుకాడ వలేసిపట్టి చెరిచి కడుపుసేసి నిలదీసి అడిగితే... 'నా కులమెక్కడా... దాని కులమెక్కడా' అని నిగ్రవీగిన మునసబు రామశాస్త్రి దాని పక్కనే బూడిదవుతున్నాడు.

పోనీలే అయ్యా! బతికినంత కాలం అంటరానోళ్ళుగా ఉన్న మావాళ్ళకి చచ్చిపోయాక వల్లకాటిలో ఈ దొరబాబులతో పాటు ఒకే కాష్టం మీద పక్క పక్కనే తగలబడి పోతోంటే వల్లకాట్లోనైనా నీళ్ళతో సమానమై పోయాం లెమ్మన్న సంతోషం మాత్రం మావాళ్ళందరికీ దక్కింది. సచ్చిపోయినోడు అంతా ఒకటేనన్న సత్తెం తెలిసింది..."

రంగమ్మ మాట్లాడుతూనే ఉందలా...

ఆకులం... ఈ కులం అనే భేదంలేకుండా అన్ని కులాల శవాలూ ఒకే కాష్టంలో కాలి బూడిదై పోయాయి... ★